# ముమ్మరంగా యాసంగి



- అంచనాలను సిద్ధం చేసిన వ్యవసాయ శాఖ
- అవసరానికి అనుగుణంగా విత్తనాలు, ఎరువులు సిద్ధం
- జిల్లాలో 5 లక్షల ఎకరాల్లో సాగుకు అవకాశం
- ఇతర పంటలపైనా దృష్టి సారిస్తున్న అన్నదాతలు
- సమృద్ధిగా జల వనరుల లభ్యతతో ధైర్యంగా ముందడుగు

ఖలీల్‌వాడి, డిసెంబర్ 13 : యాసంగి సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరగనున్నది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అంచనాలను సిద్ధం చేసింది. జలవనరులు పుష్కలంగా ఉండడంతో అంచనాలకు మించి పంటలు సాగవుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో 2023-24 సంవత్సరానికి 5,07,539 ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నారు. 2022 యాసంగిలో 4,08,444 ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా వేయగా 5,07,532 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ యాసంగిలో వరితో పాటు రైతులు ఇతర పంటల సాగుపైనా దృష్టి సారించారు. అవసరం మేరకు ఎరువులు, విత్తనాలను సైతం వ్యవసాయశాఖ సిద్ధంగా ఉంచింది. యాసంగి సీజన్ అంటేనే గతమంతా కన్నీళ్ల పర్యంతం, సమయానికి కరెంట్ రాక, అందుబాటులో విత్తనాలు, ఎరువులు లేక అన్నదాతలు పడిన గోస అంతా ఇంతా కాదు. అప్పో సొప్పో చేసి సాగుకు ముందడుగు వేస్తే సరిపడా నీళ్లు అందేవి కాదు. భూగర్భజలాలు ఇంకి బోర్లలో నీరు వచ్చేది కాదు. సాగు కాలువల్లో చుక్కనీరు కనిపించక రైతుల్లో భయాందోళనలే వెంటాడేవి. మరోవైపు సాగుకు కరెంట్ కటకట తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసేది. రాత్రి పూట పొలాల వెంట పరుగులు తీసి పాముకాటుకు, విద్యుత్ తీగల బారిన పడి మృత్యువాత పడిన వారు ఎంతోమంది. యాసంగి సీజన్ ముగిసిన తర్వాత చేతికి పెట్టుబడి పైసలు కూడా రాకపోగా అప్పులు చెల్లించలేక ఆత్మహత్యలే శరణ్యం అనుకునేది. ఇలాంటి దుస్థితి నుంచి సుభిక్షమైన వ్యవసాయంలోకి రైతులు అడుగు పెట్టారు. ఇప్పటి వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఇవ్వడంతో సాఫీగా సాగింది. ఎలాంటి ఆటంకాలు, ఆత్మహత్యలు, పాముకాటు లేకుండా రైతులు పంటలు పండించారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు చెరువులు ఎండిపోకుండా నీరు ఉండడంతో పంటలు బాగా పండుతున్నాయి. కానీ 2023-24లో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో రైతుల పరిస్థితి ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సి ఉంది. 24 గంటల కరెంట్ ఇస్తారా లేదా అనే విషయంలో రైతులు తర్జనభర్జన అవుతున్నారు.

**5 లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం**

జిల్లావ్యాప్తంగా 29 మండలాల్లో రెండు అర్బన్ మండలాలను మినహాయిస్తే మిగిలిన 27 మండలాల్లో పెద్ద ఎత్తున వ్యవసాయ భూములు సాగుకు నోచుకుంటున్నాయి. ఈ లెక్కల ప్రకారం యా సంగి 2023-24 లో వ్యవసాయ శాఖ అంచనాలు భారీగా నమోదు చేసింది.5,07,539 ఎకరాల్లో పంటలు వేస్తారని నివేదికలను రూపొందించారు.

**అందుబాటులో విత్తనాలు**

అంచనాలకు అనుగుణంగా అధికారులు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నారు. వరి 99,954 క్వింటాళ్లు, మక్కజొన్న 1897, శనగ 5643, మినుము 15, సజ్జలు 343, నువ్వులు 287, సన్‌ఫ్లవర్ 112 , కుసుమ 14, జొన్నలు 684 క్వింటాళ్లు అవసరమని అంచనా వేశారు.

**ఎరువుల అవసరం**

| | |
|---|---|
| యూరియా | 74,463 |
| డీఏపీ | 18194 |
| ఎంవోపీ | 11942 |
| కాంప్లెక్స్ | 43446 |

**2023-24 యాసంగి సాగు ప్రణాళిక**

| పంట | గత ఏడాది సాగు | 2023-24 అంచనా |
|---|---|---|
| వరి | 399818 | 399818 |
| మక్కజొన్న | 23947 | 23710 |
| శనగలు | 21320 | 22572 |
| మినుములు | 427 | 187 |
| సజ్జలు | 5914 | 8571 |
| నువ్వులు | 12854 | 14370 |
| పొద్దుతిరుగుడు | 5405 | 5598 |
| కుసుమ | 278 | 337 |
| జొన్నలు | 26708 | 27348 |
| ఇతర పంటలు | 10861 | 5028 |
| మొత్తం | 5,07,532 | 5,07,539 |

## ఎరువులు అందుబాటులో ఉంచాలి

**వ్యవసాయాధికారులతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సమీక్ష**



మాట్లాడుతున్న కలెక్టర్

నిజామాబాద్ స్పోర్ట్స్, డిసెంబర్ 13 : జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో ఎరువుల సమీకరణ, వాటి పంపిణీ తీరుతెన్నులపై బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఎక్కడా యూరియా కొరత నెలకొనకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులకు వారు సాగు చేస్తున్న పంట విస్తీర్ణాన్ని అనుసరిస్తూ సరిపడా మోతాదులో ఎరువులు అందించాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎరువుల క్రయవిక్రయాల వివరాలను ఈ-పాస్ మెషిన్ ద్వారా వెంటనే నమోదు చేసేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తేవాలన్నారు. నకిలీ, నాసిరకం విత్తనాలు, క్రిమిసంహారక మందులు, ఎరువులతో రైతులు మోసపోకుండా పకడ్బందీ పర్యవేక్షణ జరుపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా సహకార అధికారి సింహాచలం, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రంజిత్‌రెడ్డి, ఆయా మండలాల ఏవోలు పాల్గొన్నారు.

## సమస్య పరిష్కారానికి అధికారుల హామీ

వేల్పూర్, డిసెంబర్ 13: ప్రహరీ నిర్మాణం విషయంలో గత కొన్నిరోజులుగా ఇరు వర్గాల మధ్య నెలకొన్న వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. శ్మశానం వద్ద అక్రమంగా నిర్మించిన ప్రహరీని తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామ కమిటీ సభ్యులు బుధవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న అడిషనల్ డీసీపీ జయరామ్,ఆర్మూర్ ఏసీపీ జగదీశ్, భీమ్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, ధర్పల్లి సీఐ సైదయ్య, బాల్కొండ, రూరల్ నియోజకవర్గంలోని ఎస్సైలు గ్రామానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. అయినా సమస్య పరిష్కారం అయ్యే వరకు కదిలేది లేదని వీడీసీ సభ్యులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఉన్నతాధికారులతో మాట్లాడి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

## బోధన్ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి సస్పెన్షన్

బోధన్, డిసెంబర్ 13: బోధన్ ఎల్ఎంఎస్ పాయింట్ ఇన్‌చార్జి అజయ్‌కుమార్‌ను జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సస్పెండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. బోధన్ ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి అక్రమంగా బియ్యాన్ని అక్రమంగా తరలించారని విచారణలో తేలడంతో వేటు వేశారు. బోధన్ ఎల్ఎంఎస్ పాయింట్‌కు సమీపంలో గత సెప్టెంబర్ 16న ఒక ఆటోలో అనుమానాస్పదంగా బియ్యం రవాణా అవుతుండగా, కొందరు అందించిన సమాచారం మేరకు ఆ ఆటోను బోధన్ పోలీసులు పట్టుకున్నారు. ఆటోలో 17 క్వింటాళ్ల ఉండడంతో ఈ వ్యవహారాన్ని పౌరసరఫరాలశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆ బియ్యాన్ని బోధన్ పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు తరలిస్తున్నట్లు ఒక డూప్లికేట్ రిలీజ్ ఆర్డర్‌ను ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జిగా ఉన్న అజయ్‌కుమార్ చూపించి, సదరు హాస్టల్ వార్డెన్ లలితకు కూడా ఫోన్‌చేసి ఆ బియ్యం తమ హాస్టల్‌కు వస్తున్నట్లు లెటర్ ఇవ్వమని ఒత్తిడి చేసినట్లు విచారణలో తేలింది. ఆ హాస్టల్ వార్డెన్ వాస్తవానికి అంతకన్న ముందే తమ హాస్టల్‌కు సంబంధించిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌లో వేలిముద్రలు వేసి తీసుకున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో అజయ్‌కుమార్ అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నట్లు రుజువుకావడంతో పాటు, విచారణను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించాడని కూడా తేలింది. పౌరసరఫరాలశాఖ అధికారుల విచారణ నివేదిక ఆధారంగా అజయ్‌కుమార్‌పై జిల్లా కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు.

## ఎన్సీఎస్ఎఫ్‌ను తెరిపించేందుకు చొరవ చూపాలి

**జిల్లాలోని ఎమ్మెల్యేలకు ఎన్‌సీఎస్ఎఫ్ పర్యవేక్షణ కమిటీ ప్రతినిధుల వినతి**

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 13 : నగర శివారులోని సారంగాపూర్ సహకార చక్కెర కర్మాగారం(ఎన్‌సీఎస్ఎఫ్) గత టీడీపీ పాలనలో మూసివేయబడిందని దాన్ని వెంటనే తెరిపించేందుకు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలందరూ ప్రత్యేక చొరవ చూపాలని బుధవారం ఎన్‌సీఎస్ఎఫ్ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు కొండెల సాయిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్‌సూర్యనారాయణగుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రాలను అందజేశారు. సారంగాపూర్ సహకార చక్కెర కర్మాగారంలో 1962లో చెరుకు క్రషింగ్ ప్రారంభించారన్నారు. ఫ్యాక్టరీ పరిధిలోని 126 గ్రామాల రైతులకు లాభం చేకూర్చే విధంగా కృషి చేశారన్నారు. 23,216 మంది వాటాదారులు రూ.2.58 కోట్లు వాటాధనం కలిగి ఉన్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎన్‌సీఎస్ఎఫ్‌ను వాటాదారులుగా ఉన్న రైతులకు అప్పగించినట్లయితే ఇథనాల్ ప్లాంటును ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఇథనాల్ ప్లాంటు ఏర్పాటు చేయడం ద్వారా 500 మందికి ఉపాధి అవకాశం దొరుకుతుందని ఎమ్మెల్యేలకు వివరించారు. ఎమ్మెల్యేలందరూ సీఎం దృష్టికి తీసుకెళ్లి మూసివేసిన ఫ్యాక్టరీని తెరిపించి రైతులకు అప్పగించేలా చూడాలని విన్నవించారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో ఎన్‌సీఎస్ఎఫ్ పరిరక్షణ కమిటీ ప్రతినిధులు సూర్యారెడ్డి, నారాయణరెడ్డి, రాధాకిషన్‌గౌడ్, లక్ష్మారెడ్డి, బొడ్డు గంగారెడ్డి, సాయికుమార్ తదితరులున్నారు.

## ధర్మాన్ని పరిరక్షించాలి

**కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి**

నిజామాబాద్ కల్చరల్, డిసెంబర్ 13 : ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేందుకు, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలంటే గోరక్షణ, ధర్మ ప్రవర్తన దోహదపడతాయని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి అన్నారు. జిల్లాకేంద్రంలోని గంగస్థాన్‌లోఉన్న ఉత్తర తిరుపతి క్షేత్రంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఇందూరు పట్టణం ధార్మిక చింతనకు పుట్టినిల్లు అని, ఇక్కడ అనేక ఆలయాలు చారిత్రక నేపథ్యం కలిగి ఉన్నాయని అన్నారు. పూజలనంతరం భక్తులకు తీర్థాన్ని పంపిణీ చేశారు. ఆలయ ప్రతినిధులు సంపత్, జలంధర్, శశికాంత్ కులకర్ణి, వేలేటి పవన్ తదితరులు పాల్గొన్నారు.



నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

I, SUDI GANGADHAR S/O SUDI ASHANNA (Old Name) R/o. H.No.3-46, Vill: Deekampally, Mdl, Makloor, Dist .Nizamabad T.S. Changed My Name as SUDHI GANGADHAR S/O SUDHI ASHANNA (New Name)

**WANTED**

★ రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.
NT-314474




**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.